సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 24 । నవంబర్ । 2023



అన్నదాన ట్రస్ట్‌కు రూ.1,00116 విరాళం

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి నాగా శ్రీనివాస్, రామలక్ష్మి దంపతులు (వన్నె చింతలపూడి) రూ.1,00116 విరాళంగా ఇచ్చారు.



రత్నగిరికి ఏకాదశ

కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిపోయింది. - వివరాలు 8లో▸

6 వేల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 600, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

శిశు సంక్షేమ శాఖలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: జిల్లా శిశు సంక్షేమ, సాధికార అధికారి కార్యాలయంలోని బాలల సంరక్షణ కేంద్రం (శిశుగృహ)లో పనిచేయడానికి వివిధ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శిశు సంక్షేమ, సాధికారిక అధికారి ఎం.జాన్‌సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక సంవత్సరం కాంట్రాక్టు పద్ధతిపై పనిచేయడానికి మేనేజర్ పోస్టు 1 (స్త్రీ), సోషల్ వర్కర్ 1(స్త్రీ), నర్సు 1(స్త్రీ), డాక్టర్ పార్ట్‌టైమ్ 1(స్త్రీ), ఆయాలు 6 పోస్టులు, చౌకీ దార్ 1పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 25 నుంచి 42 సంవత్సరాల వయసు కలిగి ఉండాలి. ఆసక్తి గల అభ్యర్థులు డిస్ట్రిక్ వెబ్ సైట్ కోనసీమ.ఏపీ, గవర్నమెంట్.ఇన్‌కు దరఖాస్తు అప్‌లోడ్ చేసి జతచేసిన నకలును డిసెంబర్ 7వ తేదీ లోపు తమ కార్యాలయ పనిదినాలలో అందజేయాలన్నారు.

విఘ్నేశ్వరుని హుండీ ఆదాయం రూ.19,08,998



హుండీని తెరుస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: విఘ్నేశ్వరుని హుండీ ఆదాయాన్ని ఆలయ తనిఖీదారు జంపా రామలింగేశ్వరరావు, ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. 49 రోజులకు రూ.19,08,998 లభించినట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 21 విదేశీ నోట్లు లభించినట్లు తెలిపారు.

నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యం కావాలి

కొత్తపేట: ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఐఈఓ) ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి సూచించారు. ప్రస్తుతం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు యూనిట్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో డీఐఈఓ సత్యనారాయణరెడ్డి గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించేలా తయారు చేయాలని అధ్యాపకులకు సూచించారు. దానిలో భాగంగా మార్కులు సాధనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి మెలుకువలు చెప్పి, ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని కూడా ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాను ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించాలనే కృషి, పట్టుదల ప్రతీ ఒక్క విద్యార్థిలో కలగాలని అన్నారు. తద్వారా ఉత్తమ ఫలితాలతో ఉత్తీర్ణతా శాతంతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు ఉద్బోధించారు. అనంతరం నాడు – నేడు పథకం కింద కళాశాల అభివృద్ధి పనులను డీఐఈఓ సత్యనారాయణరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కరెం రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు అర్హత



క్రీడాకారులతో కోచ్ మణికుమార్

రాజోలు: జాతీయ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లో జరిగే పోటీలకు రాజోలుకు చెందిన కె.బి.ఎస్.ఎల్.శైలజ అర్హత సాధించిందని కోచ్ రాయుడు మణికుమార్, సహాయ కోచ్ బండారు కరుణకుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 21న రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అండర్-19 విభాగంలో శైలజ బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించింది. అండర్-19 రాష్ట్ర స్థాయి పోటీల్లో జి.శ్రీదేవి వెండి పతకం, సీహెచ్ ధరణి రజత పతకాలు సాధించి ప్రతిభ చూపారు. అండర్-17 విభాగంలో వై.లక్ష్మీశశిరేఖ, కె.ధాత్రిజ రజత పతకాలు సాధించారన్నారు.

26న హేతువాద మహాసభ

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా హేతువాద సంఘ మహాసభ ఈ నెల 26న అమలాపురం జెడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ తెలిపారు. వైజ్ఞానిక దృక్పథం – మానవాభివృద్ధి, విశ్వతత్వం– జీవ పరిణామం, మూఢ నమ్మకాలు– శాస్త్రీయ అవగాహన పై చర్చలు ఉంటాయన్నారు.

ఉవ్వెత్తున ఎగసిన సామాజిక ఉత్తేజం



ప్రత్తిపాడులో జరిగిన సామాజిక సాధికార సభకు హాజరైన జన సందోహంలో ఒక భాగం



అంబేడ్కర్, జ్యోతీరావ్ పూలే, వైఎస్సార్‌ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఈ నాలుగున్నరేళ్లలో సంక్షేమంతో తమకు పట్టం కడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు బ్రహ్మరథం పట్టాయి. ఆయా వర్గాలు సాధించిన సామాజిక సాధికారతను ప్రత్తిపాడు సభ ప్రతిబింబించింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తమకు చేసిన మేలును మరచిపోకుండా కృతజ్ఞత చూపుతామంటూ ఆయా వర్గాలు భారీగా తరలిరావడంతో ప్రత్తిపాడు సామాజిక సాధికారయాత్ర సభ జన సాగరాన్ని తలపించింది. తమ గౌరవ ప్రతిష్ఠలను మరింత ఇనుమడించేలా సామాజిక హోదా పెంచిన సీఎంకు ముక్త కంఠంతో మద్దతు పలికిన తీరు ముచ్చట గొలిపింది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సభా ప్రాంగణం సామాజిక నినాదంతో హోరెత్తింది.

- **పోటెత్తిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు**
- **మెట్ట నుంచి కదలివచ్చిన పల్లెసీమలు**
- సామాజిక సాధికార సభలో నవ్యోత్సాహం
- నేతల ప్రసంగాలకు సభికుల హర్షధ్వానాలతో మద్దతు
- సీఎం జగన్ నినాదాలతో హోరెత్తిన ప్రత్తిపాడు సభ



దివ్యాంగుని ఉత్సాహం



ప్రత్తిపాడులో జరిగిన సామాజిక సాధికార సభలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున. వేదికపై మంత్రి విశ్వరూప్, ఎంపీలు నందిగం సురేష్, వంగా గీత, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు పార్థసారథి, పర్వత పూర్ణచంద్రప్రసాద్, కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

సాక్షిప్రతినిధి, కాకినాడ: మెట్ట ప్రాంత పల్లెలన్నీ ప్రత్తిపాడు బాట పట్టాయి. జగన్ నినాదాలతో దారులన్నీ మారుమోగాయి. జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం అందించిన చేయూతతో సాధించిన సాధికారతను బడుగు వర్గాల నేతలు వివరిస్తున్నప్పుడు సభికులు హర్షధ్వానాలు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తోన్న కార్యక్రమంలో భాగంగా గురువారం కాకినాడ జిల్లా ప్రత్తిపాడులోని అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో సామాజిక సాధికార బహిరంగ సభ జరిగింది. దీనికి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. మెట్ట ప్రాంతంలోని నాలుగు మండలాల నుంచి వేలాదిగా తరలివచ్చిన జనసందోహంతో బహిరంగసభ కోలాహలంగా మారింది. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా అందిన సాయానికి జై జగన్ అంటూ నినదించారు.

గంట ముందే చేరుకున్న జనం

ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని పల్లెలతో పాటు మెట్ట ప్రాంతంలోని ఉప ప్రణాళికా ప్రాంతం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలు పోటెత్తాయి. 4.30 గంటలకు సభ ప్రారంభమవ్వగా గంట ముందుగానే సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గంటకు పైగా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రసంగిస్తున్నంత సేపూ జనం ఆసక్తిగా ఆలకిస్తూ కనిపించారు. తమ వర్గాలకు జగన్ చేపట్టిన సంక్షేమాన్ని ప్రస్తావించిన ప్రతి సందర్భంలోను మహిళల నుంచి మంచి స్పందన లభించింది. గోదావరి జిల్లాల్లో ఏదో అయిపోతోందని చెబుతున్నదని బూటకాలు కల్పిస్తున్న వారంతా ఈ సభ చూడాలని వక్తలు పేర్కొన్నారు. జూలు విదిల్చిన సింహాలుగా కనిపిస్తోన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలను చూస్తే వారి మాటలు వాస్తవం కాదని అర్థమవుతోందన్నారు. ఈ సందర్భంగా ఒక్కసారిగా జగన్ నినాదాలు హోరెత్తాయి. బస్సు యాత్ర ఎందుకు చేపట్టామో నేతలు స్పష్టీకరించారు. పోరాట పటిమ, క్రెడిబులిటీ, సంక్షేమానికి రోల్‌మోడల్, దమ్మున్న నాయకుడు జగన్ అంటూ నేతలు అన్నప్పుడు అవును, అవును అంటూ ప్రజలు చప్పట్లతో సంఘీభావం తెలియజేశారు.

జగన్ వస్తేనే సంక్షేమం

14 ఏళ్ల పాలనలో బడుగు వర్గాలకు చంద్రబాబు చేయనిది నాలుగున్నరేళ్లలో సంక్షేమంతో చేసి చూపారంటూ మంత్రులు విశ్వరూప్, నాగార్జున గణాంకాలతో వివరించారు. వెన్నుపోటు పథకంలో సిద్ధహస్తుడు, నమ్మించి మోసంచేయడంలో దిట్ట అని చంద్రబాబు తీరును వీరు ఎండగట్టారు. చంద్రబాబుకే గ్యారంటీ లేదు. మళ్లీ బాబు పథకానికి గ్యారంటీ ఏమిటంటూ కన్నబాబు, సురేష్ ప్రశ్నించారు. జగన్‌ను సీఎంగా చేసుకుంటే సంక్షేమానికి ఢోకా ఉండదని నాయకులు నొక్కి చెప్పారు. ఎస్సీ,బీసీలకు నామినేటెడ్ పోస్టుల నుంచి బడ్జెట్‌లో రూ.4 లక్షల కోట్లకు పైనే కేటాయించడం, 30 లక్షల ఇళ్లలో 70 శాతం ఇవ్వడాన్ని ప్రస్తావించగా జనం సానుకూలంగా స్పందించారు. 2024లో మనకు ఏమి కావాలి..అని ఎంపీ నందిగం అడిగినప్పుడు జగనే కావాలంటూ బదులిచ్చారు. సభ సక్సెస్ కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలు వేసింది. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, వరుదు కళ్యాణి, ఎమ్మెల్యేలు కె.పార్థసారథి, పెండెం దొరబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్‌రాజా, స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. శరభవరం తప్పెటగుళ్లు, తీన్‌మార్ సహా కళాకారుల ప్రదర్శనలు ఉత్సాహాన్ని నింపాయి.

సామాజిక న్యాయానికి రోల్ మోడల్



నాలుగున్నరేళ్లుగా దేశం మొత్తం మీద సామాజిక న్యాయాన్ని ఆచరణలోకి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుంది. సామాజిక న్యాయానికి ఆయన ఒక రోల్‌మోడల్. చంద్రబాబూ మీ హయాంలో సామాజిక న్యాయం ఏం జరిగిందో, గడచిన ఈ నాలుగున్నరేళ్లలో ఏ స్థాయిలో జరుగుతోందో చర్చకు సిద్ధమా. సామాజిక న్యాయానికి, సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్‌గా జగన్ నిలుస్తున్నారు. తెలంగాణ ఎన్నికల్లో ఓట్ల కోసం అక్కడి పార్టీలు ఏపీలో వలంటీరు వ్యవస్థ తీసుకువస్తామంటున్నాయి. ఏపీలో మాదిరిగానే పింఛన్‌లు తెల్లవారుజామునే ఇస్తామని చెబుతున్నాయి. ఈ మాటలే జగన్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం.

– కురసాల కన్నబాబు, ఎమ్మెల్యే

క్రెడిబులిటీకి కేరాఫ్ జగన్



చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచే తీసివేశారు. అందులో 10 శాతం కూడా నెరవేర్చలేదు. జగనన్న పాలన క్రెడిబులిటీకి కేరాఫ్. గత ఎన్నికల్లో సాధించిన ఘన విజయంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల పాత్ర కీలకమైనది. ఆ రోజు నమ్మకంతో మన వర్గాలన్నీ జగనన్నకు ఓటు వేశాయి. మనం పెట్టుకున్న నమ్మకాన్ని సుపరిపాలనతో ఆయన నిజం చేశారు. చంద్రబాబు పాలనలో బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలు అవమానాలకు గురయ్యారు. ఆయన హయాంలో బీసీలకు కేవలం రూ.35వేల కోట్లు ఖర్చుపెడితే, సీఎం జగనన్న 1.12 కోట్లు ఖర్చుపెట్టారు. ఎస్సీల కోసం చంద్రబాబు రూ. 33వేల కోట్లు వెచ్చిస్తే జగనన్న రూ. 75వేల కోట్లు ఖర్చుపెట్టారు. ఎస్టీలకు బాబు రూ.11వేల కోట్లు ఖర్చుపెడితే మన ప్రభుత్వం 25వేల కోట్ల ఖర్చు చేసింది.

– వరుదు కళ్యాణి, ఎమ్మెల్సీ

వివాహ ఖర్చు భారం తగ్గించేందుకే..

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా నిధులు విడుదల
- కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనురాధ, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్ కుడుపూడి సూర్యనారాయణ



లబ్ధిదారులకు నమూనా చెక్కును అందిస్తున్న ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తదితరులు

అమలాపురం రూరల్: పేద తల్లిదండ్రులకు తమ కుమార్తెల వివాహ ఖర్చుల భారాన్ని తగ్గించేందుకు, చదువుల వ్యాప్తికి, బాల్య వివాహాల నిరోధానికి మార్పుకు చిహ్నంగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలు ఆవిర్భవించాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఈ ఏడాది జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పెళ్లిళ్లు నిర్వహించుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని జంటలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా నిధులను వారి బ్యాంకు ఖాతాలకు ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు కుడిపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలు తమ పిల్లల వివాహాలను గౌరవ ప్రదంగా నిర్వహించే సామాజిక బాధ్యతకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోందన్నారు. పేదలు కనీస చదువులు చదవాలన్న తపనతో వధూవరులకు 10వ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, బాల్యవివాహాల నిరోధానికి వధువుకు 18, వరుడికి 21 సంవత్సరాలు దాటాలని నిబంధనలు విధించిందన్నారు. కోనసీమ జిల్లాలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 151 జంటలకు రూ.151 లక్షలు, ఎస్సీ కులాంతర వివాహం వివాహం చేసుకున్న నాలుగు జంటలకు రూ.4.80 లక్షలు, ఎస్టీ వర్గాలకు చెందిన రెండు జంటలకు రూ.రెండు లక్షలు, బీసీ సామాజిక వర్గానికి చెందిన 177 జంటలకు రూ.89.50 లక్షలు, బీసీ కులాంతర వివాహం చేసుకున్న 17 జంటలకు రూ.12.75 లక్షలు, ఒక మైనారిటీ జంటకు రూ.లక్ష, మైనారిటీ కులాంతర వివాహం చేసుకున్న ఒక జంటకు రూ.1.20 లక్షలు, నాలుగు దివ్యాంగ జంటలకు, రూ.1.50 లక్షలు చొప్పున రూ. ఆరు లక్షలు, రెండు భవన నిర్మాణ కార్మిక జంటలకు రూ.40 వేలు చొప్పున రూ.80 వేలు మొత్తం 359 జంటల వివాహ ఖర్చులకు రూ.269.05 లక్షల ఆర్థిక సాయాన్ని అందించామన్నారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు పేద కుటుంబాలలో అమ్మాయిల వివాహ ఖర్చులకు ఆలంబనగా మారాయన్నారు. పి. గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మాట్లాడుతూ పేద ఇంటి ఆడపిల్లల వివాహాలు సజావుగా నిర్వహించుకునేందుకు మంగళకరమైన పథకం కల్యాణమస్తు అన్నారు. జంటలను ఆశీర్వదించి వారి తల్లుల ఖాతాలో ప్రోత్సాహక నిధులు జమ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి బాల మునికుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఈ.జ్యోతిలక్ష్మిదేవి, డీఆర్‌డీఏ పీడీ శి.శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం



రాజకీయ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ చాంబర్‌లో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణలోని పురోగతిని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా కచ్చితత్వంతో రూపొందించేందుకు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సవరణ ప్రక్రియలో తమ వంతు భాగస్వామ్యం వహించి ప్రక్రియ సజావుగా జరగడానికి సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. ఈ సవరణ ప్రక్రియలో ఒకే డోర్ నంబర్‌లో పదిమంది ఓటర్లు పైబడి ఉంటే వారిని సర్వే ద్వారా గుర్తించి, వేరే డోర్ నంబర్ కేటాయిస్తామన్నారు. కొత్తగా అర్హులైన వదిలివేసిన ఓటర్లను చేర్చడం జాబితా సవరణ ప్రాథమిక లక్ష్యమని, ప్రత్యేక ఓటరు జాబితా సంక్షిప్త సవరణ 2024లో ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పుగా చేర్చడంపై అభ్యంతరాలను తెలపవచ్చునన్నారు. జనవరి 1, 2024 నాటికి లేదా అంతకు ముందు 18 సంవత్సరాలు పూర్తి చేసిన లేదా పూర్తిచేసుకున్న వారు ఓటర్లుగా నమోదు కావడానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. జనవరి 5న ఓటర్ల జాబితా తుది ప్రచురిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల దరఖాస్తులు డిసెంబర్ 9 వరకు స్వీకరిస్తామన్నారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, రాజకీయ పార్టీ ప్రతినిధులు కారేం వెంకటేశ్వరరావు, దూరి రాజేష్, అల్లాడి స్వామినాయుడు, యార్లగడ్డ రవీంద్ర, కుడుపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విలువ ఆధారిత వస్తువులతో అధిక రాబడి

అంబాజీపేట: రైతులు తమ వద్ద ఉన్న కొబ్బరి కాయలను నేరుగా విక్రయించకుండా విలువ ఆధారిత వస్తువులను ఉత్పత్తి చేసి విక్రయించి ఆదాయం పొందాలని పందిరి మామిడి ఉద్యాన పరిశోధనా కేంద్ర ఆహార విభాగ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.సి.వెంగయ్య అన్నారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానంలో డాక్టర్ ఎస్.బి.వి.చలపతిరావు అధ్యక్షతన కొబ్బరి అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల ఉద్యాన అధికారులకు కొబ్బరి విలువ ఆధారిత, కొబ్బరి అభివృద్ధి బోర్డు పథకాలపై రెండవ రోజు శిక్షణ గురువారం నిర్వహించారు. శాస్త్రవేత్త వెంగయ్య మాట్లాడుతూ కొబ్బరిలో విలువ ఆధారిత ఉత్పత్తులు, ప్రాసెసింగ్‌పై అవగాహన కల్పించారు. తెగుళ్ళ విభాగ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ.గోవర్ధనరావు, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు, కాకినాడ ఉద్యాన అధికారి రమణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలిక నిశ్చితార్థాన్ని అడ్డుకున్న ఐసీడీఎస్ సిబ్బంది



రెండు కుటుంబాల వారితో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సిబ్బంది

సామర్లకోట: పట్టణ పరిధిలో ఒక బాలిక నిశ్చితార్థం తంతును ఐసీడీఎస్ సిబ్బంది గురువారం అడ్డుకున్నారు. తోటవారి వీధిలో 16 సంవత్సరాల బాలికకు పెద్దాపురానికి చెందిన మేనమామతో వివాహం చేయడానికి తల్లిదండ్రులు గురువారం రహస్యంగా నిశ్చితార్థం ఏర్పాటు చేయగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరీ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. మైనర్ వివాహం చట్ట ప్రకారం నేరం అవుతుందని హెచ్చరించారు. బాలికకు 18 సంవత్సరాలు వచ్చిన తరువాత మాత్రమే వివాహం చేసే విధంగా ఇరు కుటుంబాలను ఒప్పించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ చైల్డ్ వెల్ఫేర్ జీఎం ఎస్కే లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు వి.వెంకటలక్ష్మి, ఎంపీ శ్రీలక్ష్మి, వాణీదేవి, టి.నాగమణి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

తాళ్లరేవు: ఇంటి పెరట్లో ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా షాక్‌కు గురై యర్రంనీడి వెంకటరమణ(55) మృతి చెందాడు. కోరంగి ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల మేరకు జి.వేమవరం రామాలయం పేటకు చెందిన వెంకటరమణ నీటి కోసం విద్యుత్ మోటారు వేస్తుండగా షాక్‌కు గురై మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

రత్నగిరికి ఏకాదశ

- ఒక్కరోజే రూ.కోటి ఆదాయం
- స్వామిని దర్శించుకున్న 80 వేలమంది
- రికార్డు స్థాయిలో ఎనిమిది వేల వ్రతాల నిర్వహణ



స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం : కార్తిక శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం రత్నగిరి సత్యదేవుని ఆలయం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిపోయింది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఆలయ ప్రాంగణం ఇసుకేస్తే రాలని విధంగా జనసందోహంతో నిండిపోయింది. సత్యదేవుని ఆలయానికి భక్తులు అధికంగా తరలి రావడంతో దేవస్థానం ఘాట్‌రోడ్లు, మల్టీ లెవెల్ పార్కింగ్ స్థలాలు కార్లతో నిండిపోయాయి. రికార్డు స్థాయిలో సుమారు 80 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. కార్తికమాసం ప్రారంభమయ్యాక గత పది రోజుల్లో ఇంత భారీ సంఖ్యలో భక్తులు విచ్చేయడం ఇదే ప్రథమం. సత్యదేవుని వ్రతాలు సాయంత్రం నాలుగు గంటల సమయానికి ఎనిమిది వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.కోటి ఆదాయం వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

తెల్లవారుజాము ఒంటి గంట నుంచి వ్రతాలు, దర్శనాలు

బుధవారం రాత్రికే సుమారు 20 వేల మంది భక్తులు రత్నగిరికి చేరుకోవడంతో స్వామివారి ఆలయాన్ని గురు వారం తెల్లవారుజామున ఒంటిగంటకు తెరిచి వ్రతాలు ప్రారంభించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వర్ణపుష్పాలతో స్వామివారికి తెల్లవారుజామున అష్టోత్తర పూజ, ఉదయం లక్ష పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారుజామున మూడు గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. అప్పటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు రద్దీ కొనసాగింది. స్వామివారి వ్రత మంటపాలు, నిత్య కల్యాణ మంటపం, పాత కల్యాణ మంటపాలు అన్నీ వ్రతాలాచరించే భక్తులతో నిండిపోయాయి. స్వామివారి అంతరాలయ దర్శనం టికెట్ తీసుకున్న భక్తులను కూడా వెలుపల నుంచే దర్శనానికి అనుమతించారు. స్వామివారిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. తూర్పు రాజగోపురం ఎదురుగా గల రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో, రావిచెట్టు వద్ద, ధ్వజస్తంభం వద్ద జ్యోతులు వెలిగించి దీపారాధన చేశారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా దీపాలతో నిండిపోయింది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో స్వామివారి నిత్యకల్యాణ మంటపంలో కూడా ఉదయం 11 గంటల వరకు వ్రతాలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుని నిత్య కల్యాణం ప్రారంభించారు. సుమారు 80 మంది భక్తులు కల్యాణంలో పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



మల్టీలెవెల్ పార్కింగ్ స్థలంలో బారులు తీరిన వాహనాలు

ఎనిమిది వేల వ్రతాలలో రూ.300 టిక్కెట్ వ్రతాలే 5,500

గురువారం సత్యదేవుని వ్రతాలు ఎనిమిది వేలు నిర్వహించగా దాదాపు 5,500 వ్రతాలు రూ.300 టిక్కెట్లతో సామాన్య భక్తులు నిర్వహించినవి కావడం గమనార్హం. రూ.రెండు వేల వ్రతాలు 500, రూ.1,500 వ్రతాలు 600 నిర్వహించారు. మిగిలినవి రూ.800 వ్రతాలు.

భక్తులకు ప్రసాదం, పిల్లలకు పాలు పంపిణీ

వ్రతాల ద్వారానే సుమారు రూ.60 లక్షల ఆదాయం సమకూరగా మిగిలిన విభాగాల ద్వారా రూ.40 లక్షలు వచ్చింది. మొత్తం మీద అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.కోటి ఆదాయం సమకూరింది. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్, ఏసీ రమేష్‌బాబు దేవస్థానంలోనే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సుమారు 15 వేల మంది భక్తులకు ఉచితంగా పులిహోర, దద్దోజనం పంపిణీ చేశారు. చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు.

వరకట్నం కేసులో భర్తకు ఏడాది జైలు

కాకినాడ లీగల్: వరకట్నం వేధింపు కేసులో భర్తకు ఏడాది జైలు, రూ.5 వేల జరిమానా, మోసం చేసిన కేసులో భర్త, అత్తమామలు, భర్త తాతకు రెండేళ్ల జైలు, రూ.5వేలు చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ మొబైల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.ఉషాలక్ష్మికుమారి గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా కొల్లూరుకు చెందిన బారెడ్డి వెంకట సుధాకరరెడ్డితో కాకినాడ రూరల్ మండలం సర్పవరానికి చెందిన శిశిరమ్యకి 2020 ఫిబ్రవరి 14తేదీన హిందు సంప్రదాయంలో వివాహమైంది. భర్తకు ఉన్న లోపం వలన భార్యను శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. ఈ విషయంపై భర్తను నిలదీయగా మాయమాటలు చెప్పాడు. భర్త కుటుంబ సభ్యులను అడగ్గా వారూ అసత్యాలు చెప్పారు. దీంతో పెద్దల సమక్షంలో రూ.20 లక్షలకు రాజీపడి కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. భర్త కుటుంబ సభ్యులు రూ.20 లక్షలకు రూ.10 లక్షల చొప్పున రెండు చెక్కులు ఇచ్చారు. భార్య శిశిరమ్య బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయ్యాయి. దీనిపై శిశిరమ్య 2020లో సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో భర్త బారెడ్డి వెంకట సుధాకర్‌రెడ్డి, మామ బారెడ్డి సుబ్బారెడ్డి, అత్త బారెడ్డి సుబ్బరత్నమ్మ, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, మరో ఇద్దరిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణ అనంతరం వేధించినందుకు భర్త వెంకట సుధాకరరెడ్డికి ఏడాది జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా, మోసం చేసినందుకు భర్త వెంకట సుధాకరరెడ్డి, అత్తమామలు సుబ్బరత్నమ్మ, సుబ్బారెడ్డి, మరో వ్యక్తి గంగిరెడ్డి కృష్ణారెడ్డికి ఒక్కొక్కరికి రెండేళ్ల జైలు, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బడుగులకు అగ్ర తాంబూలం

ఎంపీ నందిగం సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పార్థసారథి

ప్రత్తిపాడు రూరల్: నాలుగున్నరేళ్ల కాలంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు అన్నింటా అగ్రతాంబూలాన్ని అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీ నందిగం సురేష్ అన్నారు. గతంలో చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసి ప్రజాధనాన్ని దోచుకుంటే.. సీఎం జగన్ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజలను ఆర్థికంగా బలోపేతం చేశారన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాధనాన్ని దోచుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసి వర్షాలు పడితేకాని పండని రెండెకరాల భూమి నుంచి రూ.6 లక్షల కోట్లు ప్రజలను మోసం చేసి సంపాదించాడన్నారు. తమ ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలను సంపన్నులను చేస్తుంటే చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుళ్లుకుంటున్నాయన్నారు. కాపుల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా చంద్రబాబు పవన్ కల్యాణ్‌తో జనసేన పార్టీని పెట్టించారన్నారు. వంగవీటి మోహనరంగా హత్యకు కారణమైన టీడీపీకి జనసేన అధినేత మద్దతుగా నిలవడం కాపులను వంచించడమేనన్నారు. చంద్రబాబు పాలనలో రూ.2.50 లక్షల కోట్లు అప్పులు చేశారని, ఆ సొమ్ము ఏంచేశారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. పాదయాత్ర అంటే అర్థం తెలియని లోకేష్ పాదయాత్ర చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు.

సామాజిక సాధికార యాత్రకు ప్రజలు బ్రహ్మరథం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. ఇప్పటి వరకూ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.2.50 లక్షల కోట్లు సంక్షేమ పథకాల రూపంలో పేద ప్రజల అకౌంట్‌లో నేరుగా జమ చేశామన్నారు. చంద్రబాబు పాలనలో ఇందులో పది శాతం కూడా పేద ప్రజలకు ఖర్చు చేయలేదన్నారు.

సామాజిక న్యాయం

సామాజిక న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. అధికారం, బడ్జెట్, సంక్షేమం, అభివృద్ధిలో సామాజిక న్యాయానికి నిజమైన అర్థం చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జనాభా ప్రాతిపదికన తమ ప్రభుత్వంలో సామాజిక న్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వాలు ధనవంతులనే రాజ్యసభకు పంపితే సీఎం జగన్ సామాన్యులు సైతం రాజ్యసభ రాజ్యసభకు పంపారన్నారు. అట్టడుగు వర్గాలను గుర్తించి 50 పదవులను వారికి కేటాయించామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీతా విశ్వనాథ్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పాల్గొన్నారు.

పిల్లల ఆసక్తి మేరకు ప్రోత్సహించాలి

శ్రీ షిర్డిసాయి 'ఎయిమ్' సదస్సులో తనికెళ్ల భరణి



ఎయిమ్ సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న తనికెళ్ల భరణి. చిత్రంలో తంబాబత్తుల శ్రీధర్ తదితరులు

కడియం: పిల్లలకు విద్యతో పాటు ఇతర అంశాల్లో ఆసక్తిని గమనించి, వారిని ప్రోత్సహించాలని ప్రముఖ సినీనటుడు, రచయిత తనికెళ్ల భరణి అన్నారు. శ్రీ షిర్డిసాయి విద్యానికేతన్ ఆధ్వర్యంలో కడియం, రాజమహేంద్రవరంలలో రెండురోజుల పాటు ఎయిమ్ పేరుతో తల్లులకు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భరణి మాట్లాడుతూ పిల్లలను సన్నిహితంగా గమనించే అవకాశం తల్లులకే ఎక్కువ అన్నారు. పిల్లల ఆసక్తి ఏ రంగంపై ఉందో గమనించి, వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. నూరు మార్కులు సాధించే వారందరూ ఉన్నత శిఖరాలకు చేరుకోలేరని, ఉన్నతులుగా ఉన్నవారంతా నూరుశాతం మార్కులు సాధించలేరన్నారు. అందుకు తానే ఉదాహరణ అన్నారు. తనకు లెక్కలు వచ్చేవి కావన్నారు. కానీ రచయితగా మంచి గుర్తింపు పొందే స్థాయిలో ఉన్నానన్నారు. పాజిటివ్ సైకాలజిస్ట్ జీసీ కవిత మాట్లాడుతూ పిల్లలను వేరొకరితో పోల్చడం సరికాదని, చేసిన ఏ చిన్న మంచి పని అయినా ప్రశంసించడం ద్వారా వారిలో అనుకూల దృక్పథం ఏర్పడుతుందన్నారు. చిన్నారులను ప్రేమతో అనుకరిస్తూ మాట్లాడడం వల్ల వారిలో మానసిక భద్రత పెరుగుతుందని వివరించారు. హెచ్‌సీయూ సైకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి పద్మజ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లల కోసం కొంత సమయం కేటాయించినట్లయితే వారు తమ సమస్యలను వారితో చర్చించగలుగుతారని, తద్వారా అనేక సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రస్తుత తల్లిదండ్రుల్లో అది కొరవడిందన్నారు. రచయిత, ప్రేరణాత్మక వక్త వేణుభగవాన్ మాట్లాడుతూ పిల్లల అభ్యున్నతిలో తల్లుల పాత్ర కీలకమన్నారు. షిర్డిసాయి విద్యానికేతన్‌లో చదువుకున్న ప్రస్తుతం ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థుల తల్లులను ఈ సందర్భంగా చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య సన్మానించారు. మాతృమూర్తులకు ప్రత్యేకంగా ఇటువంటి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న యాజమాన్యాన్ని ప్రముఖులు అభినందించారు. పిల్లలతో తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలకు తమ అనుభవాలను జోడించి ముఖ్యవక్తలు పరిష్కారాలను సూచించారు. ముందుగా ప్రముఖులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేడు సత్యదేవుని తెప్పోత్సవం



పంటును హంస వాహనం రూపంలో ముస్తాబు చేస్తున్న సిబ్బంది

అన్నవరం : క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా శుక్రవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. సాయంత్రం ఐదు గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్లను రత్నగిరి నుంచి ఊరేగింపుగా పంపా నదీ తీరానికి తీసుకువస్తారు. అక్కడ పూజా మంటపంలో తులసి ధాత్రి పూజ నిర్వహిస్తారు. సాయంత్రం ఆరుగంటలకు పంపానదిలో హంసవాహనంపై తెప్ప మీద గల వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు పూజలు చేస్తారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ, మిరుమిట్లు గొలిపే బాణసంచా కాల్పుల మధ్య పంపానదిలో స్వామి అమ్మవార్లను మూడుసార్లు విహరింపజేస్తారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేలాది మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉండడంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు.

33 మందికే అనుమతి

స్వామివారి తెప్పోత్సవంలో వీఐపీలతో సహా వేరెవ్వరినీ అనుమతించరు. దేవస్థానం తరఫున 33 మందిని మాత్రమే తెప్ప మీదకు అనుమతించనున్నారు. వీరిలో ముగ్గురు వేద పండితులు ప్రధానార్చకుడు, ఇద్దరు అర్చకస్వాములు, ఇద్దరు పరిచారకులు, ఇద్దరు సీనియర్ స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితులు, మంగళధ్వని కళాకారులు, ఇతర సిబ్బంది, పంటు ఆపరేటర్స్, దేవస్థానం విద్యుత్ విభాగ సిబ్బంది ఇద్దరు, పోలీసులు ఉంటారు. వీరంతా విధిగా లైఫ్ జాకెట్లు ధరించాలని నిబంధన పెట్టారు.

బాలిక ప్రాణాలు కాపాడిన రైల్వే పోలీసులు



బాలికను అప్పగిస్తున్న ఎస్‌ఐ రవికుమార్, హెచ్‌సీ దుర్గారావు, కానిస్టేబుళ్లు ఉమాదేవి, రాజేశ్వరి

కాకినాడ క్రైం: కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్‌కు వచ్చి ఆత్మహత్యకు పాల్పడేందుకు రైలు రాక కోసం ఎదురు చూస్తున్న 13 ఏళ్ల విద్యార్థిని కాకినాడ రైల్వే పోలీసులు కాపాడారు. వివరాలను జీఆర్‌పి ఎస్‌ఐ రవికుమార్ వెల్లడించారు. రాజమహేంద్రవరం జిల్లా బొమ్మూరులోని బొమ్మూరు చెరువుకు చెందిన 13 ఏళ్ల బాలిక కాకినాడ జగన్నాథపురంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటూ ఏడవ తరగతి చదువుతోంది. తనకు హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదని తల్లితో తరచూ చెబుతూండేది. విద్య, భవిష్యత్ దృష్ట్యా అక్కడే ఉంటూ చదువుకోవాలని తల్లి సముదాయించేది. చివరికి తల్లి మాటని కాదనలేక, వసతి గృహంలో ఉండటం ఇష్టం లేక బలవన్మరణానికి పాల్పడాలని విద్యార్థిని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమై యూనిఫారం ధరించి కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడి మూడవ నంబరు ప్లాట్‌ఫాంకు వెళ్లి రైలు రాక కోసం ఎదురు చూస్తూ కూర్చుంది. అప్పటికే చాలాసేపటి నుంచి ముభావంగా ఉండి, యూనిఫారం ధరించి ఉన్న విద్యార్థిని గమనిస్తున్న జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.దుర్గారావు బాలికను సమీపించి వివరాలు అడిగారు. ఎందుకు ఇక్కడ ఉన్నావని ప్రశ్నిస్తే ఏడుపు లంఘించుకుంది. తాను చనిపోవడానికి వచ్చాననీ రైలు రాక కోసం ఎదురు చూస్తున్నానంటూ దీనంగా చెప్పింది. బాలిక సమాధానంతో కంగుతిన్న దుర్గారావు ఆమెను ఓదార్చే ప్రయత్నం చేశారు. అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు మహిళా కానిస్టేబుళ్లు ఉమాదేవి, రాజేశ్వరిలను పిలిపించారు. గంటకుపైగా వారంతా ఓదార్చి బాలిక నుంచి కుటుంబం వివరాలు సేకరించారు. తల్లిని పిలిపించి ఇరువురికి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాలికను సురక్షితంగా తల్లికి అప్పగించారు. ఆత్మహత్యకు యత్నించిన బాలిక ప్రాణాలు కాపాడిన జీఆర్‌పీ ఎస్‌ఐ రవికుమార్, హెచ్‌సీ దుర్గారావు సహా మహిళా సిబ్బందిని ఉన్నతాధికారులు సహా ప్రయాణికులు అభినందించారు.

క్రీడా పండగకు వేళాయె..

నేటి నుంచి రాయవరంలో అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలు



రాయవరంలో క్రీడా సంబరానికి సిద్ధం చేస్తున్న బాస్కెట్‌బాల్ కోర్టు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా సంబరానికి వేదికగా నిలుస్తోంది. 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ 2023 పోటీలు శుక్రవారం నుంచి రాయవరంలో ప్రారంభం కానున్నాయి. అండర్-17 బాలురు, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు శుక్రవారం నుంచి 26వ తేదీ వరకు జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర జిల్లా పోటీల్లో భాగంగా బాస్కెట్‌బాల్ కోర్టును సిద్ధం చేశారు. ఈ పోటీలను కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 400 మంది బాస్కెట్‌బాల్ క్రీడాకారులు పాల్గొననున్నారు. టోర్నమెంట్ సెలెక్షన్ గేమ్స్‌గా నిర్వహిస్తున్నారు. డే అండ్ నైట్ మ్యాచ్‌లను సెలెక్షన్ కమ్ నాకౌట్ విధానంలో నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 50 మంది ఫిజికల్ డైరెక్టర్లు, బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఇప్పటికే రాయవరం చేరుకున్నారు. ఎంపికైన రాష్ట్ర టీమ్ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారు.

ట్రాలీపైకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులకు త్రుటిలో తప్పిన ప్రమాదం
- దెబ్బతిన్న బస్సు, బోల్తాకొట్టిన వ్యాన్



దెబ్బతిన్న ప్రమాదానికి కారణమైన బస్సు ముందు భాగం

గండేపల్లి: అతివేగంగా వెళుతున్న ప్రైవేటు బస్సు లారీలపైకి దూసుకెళ్లిన ఘటనలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. బస్సులో ప్రయాణికులతోపాటు లారీ డ్రైవర్, క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు. గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదం వివరాలు ఈ విధంగా ఉన్నాయి... శ్రీకాకుళం నుంచి గుంటూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్ జగ్గంపేట శివారు వేబ్రిడ్జ్‌కు సమీపంలోకి వచ్చేసరికి ఐరన్ లోడుతో వెళుతున్న ట్రాలీని ఢీకొట్టుకుంటూ వెళ్లి కెమికల్ లోడుతో వెళుతున్న వ్యాన్‌ను కూడా బలంగా ఢీకొంది. దీంతో వ్యాన్ రోడ్డుపై బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదని జగ్గంపేట ఎస్సై కె.నాగార్జునరాజు తెలిపారు. ప్రమాద స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు, రోడ్డు సేఫ్టీ వాహన సిబ్బంది కుమార్, సతీష్, హైవే మెయింటినెన్స్ సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి ప్రమాదానికి గురైన వాహనాలను పక్కకు తీయించారు. ప్రమాదానికి కారణమైన బస్సులో సుమారు 30 మంది ప్రయాణికులు ఉన్నారని, వారందరూ మరో వాహనంలో గమ్యస్థానాలకు వెళ్లినట్టు తెలిపారు. ట్రాలీ డ్రైవర్ సుభాన్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కర్రతో కొట్టడంతో వృద్ధురాలి మృతి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం కేశవరానికి చెందిన వృద్ధురాలు పోసుపో సరోజిని (60)ని ఆమె కుమారుడు బుధవారం రాత్రి కర్రతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూరల్ పోలీసులు గురువారం తెలిపిన కథనం ప్రకారం... సరోజిని తన కుమారుడు ప్రసన్నకుమార్‌ని బంధువులకు దత్తత ఇచ్చింది. ప్రసన్నకుమార్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నాడు. రాత్రి సమయంలో మద్యం సేవించేందుకు డబ్బులు అడగ్గా ఇచ్చేందుకు తల్లి సరోజిని తిరస్కరించింది. దీంతో నిందితుడు తల్లి సరోజిని తల, నడుములపై కర్రతో గాయపర్చగా అక్కడికక్కడే మృతిచెందింది. నిందితుడు ప్రసన్నకుమార్‌ను అరెస్ట్ చేసి ఆలమూరు కోర్టులో హాజరుపర్చామని పోలీసులు తెలిపారు.



